క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు



గుంటూరు మెడికల్: స్థానిక నల్లచెరువు మదర్సాలో యువ నారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్, హోప్ విన్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగా అందించామని సీనియర్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్, హోప్‌విన్ హాస్పటల్స్ అధినేత డాక్టర్ నజీరుద్దీన్ తెలిపారు. వైద్య శిబిరంలో సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాహుల్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ డాక్టర్ సాంబశివరావు, దంత వైద్య నిపుణుడు డాక్టర్ ఫరీద్, హాస్పిటల్ మేనేజర్ పి. నాగేశ్వరరావు, మదర్ సా పెద్దలు ముఫ్తి బాషిద్, ముఫ్తి రెహమాన్, రఫీ పాల్గొన్నారు.

రెడ్ కార్పెట్ ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ ప్రారంభం



పాత గుంటూరు: రింగు రోడ్డులోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం ప్రారంభమైన రెడ్ కార్పెట్ ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌కు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని నిర్వాహకులు ఆర్.కె. నాయుడు, శైలజా రామ్ తెలిపారు. ఎగ్జిబిషన్‌లో క్లాత్, జ్యూయలరీ, హోమ్ డెకార్స్‌కు సంబంధించిన 40కు పైగా స్టాల్స్ ఉన్నాయని చెప్పారు. సోమవారం రాత్రి 9 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ప్రతి ఒక్కరూ సందర్శించాలని వారు కోరారు.

భక్తిశ్రద్ధలతో పరిశుద్ధ ఆరాధన స్త్రీల ర్యాలీ



పాత గుంటూరు: కొత్తపేట కుగ్లర్ హాస్పిటల్ ఆవరణలోని ట్రినిటీ గురు మండలంలో లూథరన్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పరిశుద్ధ ఆరాధన స్త్రీల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఈఎల్సీ ప్రథమ మహిళ కె. ఆశా కిరణ్ పరదేశీబాబుకు లూథరన్ సంఘ స్త్రీలు చర్చి మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె దేవుని వ్యాక్యోపదేశం చేశారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. రెవరెండ్ జె. దైవ ఆశీర్వాదం, రెవరెండ్ వి. క్రిష్టఫర్, సంఘ కాపరులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో బత్తుల లెనిన్, విల్సన్, బి. గ్రేస్ సుదర్శన్ భీమ్‌రాజు, టి. రాజేష్, బి. ఆంతోనమ్మ పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియం వేదికగా ఆదివారం కళాలయ మెలోడీస్ వ్యవస్థాపకుడు ఏ.వి. రత్నాజీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. తెలుగు, హిందీ చిత్రాల్లోని పాటల్ని గాయకులు పి.మొగిలి, ఈ. భరత్‌రెడ్డి, ఎం.ఎల్. మల్లేశ్వరరావు, రత్నాజీ, పి.గాయత్రీదేవి, యు. పావని వీనులవిందుగా ఆలపించారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు కళాకారుల్ని సత్కరించారు.

భారత్ వికాస్ పరిషత్ నూతన కార్యవర్గం

తెనాలి: భారత్ వికాస్ పరిషత్, అమరావతి ప్రాంత, గుంటూరు శాఖ ఆధ్వర్యంలో భారత వికాస్ పరిషత్, తెనాలి నూతన శాఖ ఎన్నిక, ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం స్థానిక కొత్తపేటలోని రాధాకృష్ణ కళ్యాణమండపంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు రూప్‌చంద్ జైన్ ఆధ్వర్యంలో జరిగిన తెనాలి శాఖ ఎన్నికలో నూతన అధ్యక్షుడిగా పెనుగొండ వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా యేపూరి పరిపూర్ణప్రసాద్, కోశాధికారిగా పీబీవీ రమేష్ బాబు ఎన్నికయ్యారు. ఇదే వేడుకలో 'భారత్ కో జానో' క్విజ్ పోటీల్లో విజేతలకు తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు చేతులమీదుగా బహుమతులను ప్రదానం చేశారు.

పటిష్ట ఓటర్ల జాబితా తయారీ లక్ష్యం



స్పెషల్ క్యాంపెయిన్ దేను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్, పక్కన తహసీల్దార్ జి. సిద్ధార్థ



బీఎల్వోతో మాట్లాడుతున్న తహసీల్దార్ పి. రత్నం



చేబ్రోలులో క్యాంపెయిన్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల ప్రత్యేకాధికారి హరిహరనాథ్, అధికారులు

- గుంటూరు ఆర్డీవో, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్
- పోలింగ్ బూత్‌ల వద్ద స్పెషల్ క్యాంపెయిన్ల పరిశీలన

ప్రత్తిపాడు: ఓటర్ల జాబితాలో మరణించిన వారి పేర్లు ఉంటే తొలగించాలని గుంటూరు ఆర్డీవో, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెన్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రైమరీ పాఠశాలల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. బీఎల్‌వోల వద్ద ఉన్న ఓటర్ల జాబితాలను పరిశీలించారు. జాబితాలను మరొక్కసారి క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. మృతులు, స్థానికంగా నివాసం ఉండని వారు, డబుల్ ఓట్లను తొలగించాలని సూచించారు. ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ ఎంతో కీలకమని, ఎలాంటి లోటుపాట్లుకు తావులేకుండా తయారు చేయాలని తెలిపారు. ఎక్కడా సమస్యలు ఉత్పన్నం కాకుండా బీఎల్‌వోలు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రైమరీ స్కూల్లోని రెండు పీఎస్‌ల వద్ద బీఎల్‌వోలు విధుల్లో లేకపోవడంతో తహసీల్దార్‌ను ప్రశ్నించారు. అనంతరం తిరిగి పెదనందిపాడుకు వెళ్లి మరలా పోలింగ్ బూత్‌ల వద్దకు ఆర్డీవో వచ్చారు. ఆ సమయానికి విధుల్లో ఒక్కరే బీఎల్‌వో ఉండటం, మరొకరు లేకపోవడంతో అతనిపై వెంటనే చర్యలకు సిఫారసు చేయాలని తహసీల్దార్‌ను ఆర్డీవో ఆదేశించారు.

ఓటరు నమోదు సమర్థంగా నిర్వహించాలి

పెదకాకాని: ఓటరు నమోదును బీఎల్వోలు సమర్థంగా నిర్వహించాలని తహసీల్దార్ పి. రత్నం సూచించారు. మండలంలోని కొప్పురావూరు, వెనిగండ్లలో ఓటరు నమోదును పరిశీలించడంతో పాటు పోలింగ్ బూత్‌లను తనిఖీ చేశారు. ఓటరు నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని బీఎల్వోలకు తెలియజేశారు. కొత్తగా ఓటు నమోదుతో పాటు చనిపోయిన వారి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించాలని ఆదేశించార. భార్యాభర్తల పేర్లు వేర్వేరు చోట్ల జాబితాలో ఉన్నట్లయితే దరఖాస్తు ఫారం ద్వారా ఒకే పోలింగ్ బూత్‌లోకి మార్చాలని సూచించారు. ముఖ్యంగా ఒకే పేరు రెండు ప్రాంతాల్లో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్వోలు శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఆధారాలు లేకుండా ఓటర్లను తొలగించడం సాధ్యం కాదు

చేబ్రోలు: సరైన ఆధారాలు లేకుండా జాబితా నుంచి ఓటర్ల పేర్లను తొలగించడం సాధ్యం కాదని పొన్నూరు నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి వై. హరిహరనాథ్ స్పష్టం చేశారు. చేబ్రోలు, నారాకోడూరుల్లో పోలింగ్ కేంద్రాల్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై ఎన్నికల సంఘం శని, ఆదివారం రెండు రోజులు స్పెషల్ క్యాంపెయిన్ ద్వారా అభ్యంతరాల్ని స్వీకరించింది. చేబ్రోలు మండలంలోని 13 గ్రామాల పరిధిలో రెండు రోజుల్లో శనివారం 49, ఆదివారం 41 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. చేబ్రోలు గాలిగోపం ఏరియాలోని 140 నంబర్ పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్‌వోతో ఎన్నికల ప్రత్యేకాధికారి మాట్లాడారు. మార్పులు, చేర్పులు, తొలగింపులు తదితర అంశాలపై వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్ర స్థాయిలో పూర్తిగా పరిశీలన చేసి సరైన ఆధారాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చేబ్రోలు మండలంలో వచ్చిన మొత్తం 1,157 దరఖాస్తుల్లో 858 ఓటర్లపై ఎటువంటి అభ్యంతరాలు లేవన్నారు. మిగిలిన 299 ఓటర్ల దరఖాస్తుల్లో 282 మంది షిఫ్టింగ్ అయ్యారని, మిగిలిన 17 దరఖాస్తులు వివిధ దశల పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. తహసీల్దారు కె.వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ మండలంలో రెండు రోజుల స్పెషల్ క్యాంపెయిన్‌లో 90 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు తదితర అంశాలన్నీ నిరంతర ప్రక్రియని, దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం వి. నాగేశ్వరరావు, ఏఎస్‌వో ధార్మారావు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న క్లస్టర్- 2 కన్వీనర్ బండారు శ్రీనివాసరావు

గుంటూరు రూరల్: జగనన్నతోనే రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తుమ్మల సుబ్బారావు తెలిపారు. నగరంలోని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే ? అనే అంశంపై సమావేశాలు నిర్వహించారు. మండల స్థాయి వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు ఆధ్వర్యంలో, క్లస్టర్- 2 వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశం కన్వీనర్ బండారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

కులమతాలకు అతీతంగా సంక్షేమం

జెడ్పీటీసీ మాట్లాడుతూ జగనన్న పాదయాత్ర సమయంలో ఇచ్చిన ప్రతి హామీని 99శాతం ప్రజలకు అందించినట్లు చెప్పారు. చంద్రబాబు హయాంలో ఒక వర్గానికి మాత్రమే జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లిస్తేనే పథకాలు అందేవని గుర్తు చేశారు. చంద్రబాబు పాలనలో ప్రజలు ఇబ్బందులు పడిన వైనం, జగనన్న పాలనలో ప్రజలు సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్న వైనాన్ని బేరీజు వేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రతి ఒక్కరూ సైనికుల్లా పోరాడాలి

సమావేశంలో క్లస్టర్- 2 కన్వీనర్ బండారు శ్రీనివాసరావు మాట్లాడుతూ వచ్చే నెల 1 నుంచి ఏపీకి జగనే ఎందుకు కావాలి ? అనే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా మండల స్థాయిలో ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలు చేసిన విధానం వివరించాలన్నారు. ఆ గ్రామానికి అప్పటివరకూ జగనన్న అందించిన సంక్షేమ పథకాల ఫలకాన్ని కూడా ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. అనంతరం సమావేశం నిర్వహించుకుని ఆరోజు ఆ గ్రామంలోనే నిద్రచేసి, మరలా ఉదయం ప్రజలతో కలసి ప్రజలకు సంక్షేమ పథకాల్ని వివరించనున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైనికుల్లా సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ సర్పంచ్ ఎదురుపాక వెంకట్, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ దగ్గుల మల్లికార్జునరెడ్డి, గుంటూరు మిర్చి యార్డు డైరెక్టర్ బందలపాటి వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ దర్శి సుజాత పాల్గొన్నారు.

బహుళ అంచెల సాగుతో అధిక దిగుబడులు



బహుళ అంచెల సాగుపై క్షేత్రస్థాయి శిక్షణ పొందుతున్న రైతులు

గుంటూరు రూరల్: బహుళ అంచెల సాగు ద్వారా తక్కువ స్థలంలో ఎక్కువ పంటలు పండించి మంచి దిగుబడులతో అధిక ఆదాయం పొందవచ్చని హార్టీకల్చర్ డెప్యూటీ డైరెక్టర్ వి.ఎస్. ధర్మజ తెలిపారు.వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రైతులకు బహుళ అంచెల సాగు విధానంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా ప్రస్తుతం కూరగాయలు, పండ్ల తోటల సాగుకి రాయితీలు అందజేస్తున్నామని, బహుళ అంచెల సాగుకు కూడా వర్తింపజేసేలా కృషి చేస్తానని చెప్పారు. నాబార్డు సహకారంతో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుళ అంచెల సాగు రూపకర్త ఆకాష్ చౌరాసియా రైతులకు శిక్షణ అందించడం అభినందనీయమని తెలిపారు. పందిరి బొంగులు ఏర్పాటు, సాగు విధానం గురించి ఆకాష్ చౌరాసియా రైతులకు ప్రత్యక్షంగా వివరించడంతో పాటు వారితో చేయించారు. పట్టణాలలో లేదా నగరాలలో 200 గజాల స్థలం ఉన్న వారంతా కుటుంబానికి అవసరమైన కూరగాయలు, ఆకు కూరలతో పాటు క్యారెట్, ముల్లంగి, అల్లం, దుంప కూరలు, బొప్పాయి, సపోటా లాంటి పండ్ల మొక్కల్ని పెంచుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో రైతు ఏడుకొండలు, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై. వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్య భద్రత



మందులు పంపిణీ చేస్తున్న విజయసారథి, మీరజ్‌కుమార్ తదితరులు

గుంటూరు రూరల్: జగనన్న ఆరోగ్య రక్ష ప్రజల ఆరోగ్య రక్షణ కార్యక్రమమని అర్బన్ మండలం క్లస్టర్- 1 కన్వీనర్ ఏటుకూరి విజయసారథి, బుడంపాడు సొసైటీ చైర్మన్ మీరజ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఏటుకూరులో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాల్ని అమలు చేస్తున్నారని తెలిపారు. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ఇంటి వద్దకే వైద్యుల్ని పంపి ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఫ్యామిలీ డాక్టర్ సేవల్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఇప్పుడు జగనన్న ఆరోగ్య రక్షతో ప్రజల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేసినట్లు వివరించారు. అనంతరం శిబిరంలో అందిస్తున్న వైద్యసేవల్ని పరిశీలించారు. పలువురికి మందులతో పాటు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇగ్నో కోర్సులతో విద్యావంతులుగా ఎదిగే అవకాశం



మాట్లాడుతున్న ఇగ్నో స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ భాను మురళీధర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) అందిస్తున్న దూరవిద్య కోర్సులతో విద్యావంతులుగా ఎదిగే అవకాశాల్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఇగ్నో స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ ఏ. భాను మురళీధర్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల ప్రాంగణంలోని ఇగ్నో స్టడీ సెంటర్‌లో ఆదివారం ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భాను మురళీధర్ మాట్లాడుతూ కళాశాలలో 1987లో ఇగ్నో స్టడీ సెంటర్ ఏర్పాటైందని తెలిపారు. దూర విద్యా విధానంలో 500 స్టడీ సెంటర్లు, 58 రకాల కోర్సులతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు. ఈ సందర్భంగా అడ్మిషన్లు, టర్మ్ ఎండ్ ఎగ్జామ్స్, ఫీజుల చెల్లింపు, పేపర్ సెలక్షన్, స్టడీ సెంటర్, కౌన్సెలర్స్ గురించి విద్యార్థులకు వివరించారు. ఇగ్నోలో చేరిన విద్యార్థులంతా ఆయా సబ్జెక్టుల్లో నైపుణ్యం సాధించాలని సూచించారు. అనంతరం ఎమ్మెస్సీ సీఎఫ్‌టీ, మేనేజ్‌మెంట్, పీజీ కోర్సులతో పాటు ప్రాజెక్టులు, స్పెషల్ ఇంగ్లిషు, అసైన్‌మెంట్స్ గురించి ఇగ్నో సీనియర్ కౌన్సెలర్స్ ప్రొఫెసర్ టీడీ విమల, బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, డాక్టర్ ఎం. వసంతరావు, డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, కె. సాంబశివరావు, ఎం. పూర్ణచంద్రరావు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పి. దేవేంద్ర గుప్తా, వై. మార్కండేయులు పాల్గొన్నారు.

బైక్ చోరీ

సుద్దపల్లి(చేబ్రోలు): ఇంటి ముందు ఉంచిన బైక్ చోరీ జరిగిన ఘటన చేబ్రోలు మండలం సుద్దపల్లిలో జరిగింది. గ్రామంలోని యాదవపాలెం వాటర్ ట్యాంక్ ప్రాంతానికి చెందిన మైలా చింతయ్య నాలుగు రోజుల కిందట బైక్‌ను ఇంటి ముందు పార్క్ చేశాడు. ఉదయం చూసేసరికి మాయమైంది. పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో ఆదివారం చింతయ్య చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జూదరుల అరెస్ట్

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం శివారులో పేకాట స్థావరంపై తాడేపల్లి పోలీసులు ఆదివారం దాడిచేసి ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ గిరిబాబు తెలిపిన వివరాలు.. వడ్డేశ్వరం శివారులో ముళ్లపొదల వద్ద పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలసి దాడిచేశారు. వీరి నుంచి రూ.2,500 స్వాదీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం వ్యాపారుల అరెస్ట్

తాడేపల్లిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న పలువురిని ఆదివారం తాడేపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐలు రమేష్, గిరిబాబు తెలిపిన వివరాలు.. చిర్రావూరు లైబ్రరీ సెంటర్‌లో ఓ నివాసంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నారని సమాచారం మేరకు కొరిటాల శ్రీనివాసరావు ఇంట్లో తనిఖీ చేయగా 24 క్వార్టర్ బాటిళ్లు, ప్రకాష్‌నగర్ నివాసి కంచర్ల మణికంఠ ఇంట్లో తనిఖీ చేయగా 10 క్వార్టర్ బాటిళ్లు దొరికినట్లు చెప్పారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేయండి

తెనాలిఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు యాత్ర ఈనెల 9న తెనాలి రానున్నదని ఆపార్టీ తెనాలి కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్ తెలిపారు. చినరావూరు డొంకరోడ్డులో ఆదివారం స్థానికులతో సమావేశాన్ని నిర్వహించి బస్సు యాత్రకు ఘన స్వాగతం పలకటంతో పాటు అందరు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు షేక్ హుస్సేన్ వలి తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు కౌన్సెలింగ్

తెనాలి రూరల్: తెనాలిలోని చినరావూరు పార్కులో ఆకతాయిలకు వన్‌టౌన్ ఎస్ఐ ఎం .ఉమామహేశ్వరరావు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి ఆదివారం సాయంత్రం నుంచి పార్కులో జనం తాకిడి ఉంటుంది. ఈ నేపథ్యంలో విజువల్ పోలీసింగ్‌లో భాగంగా ఎస్ఐ ఆదివారం రాత్రి పార్కుకు వెళ్లారు. కొంత మంది ఆకతాయిలను గుర్తించారు. అందరినీ పార్కులో ఒక చోటుకు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దీర్ఘకాల మధుమేహంతో గుండెపోటు ముప్పు



మాట్లాడుతున్న డాక్టర్ శివ శ్రీనివాసరెడ్డి

గుంటూరు మెడికల్: దీర్ఘకాల మధుమేహ బాధితులలో నాడులు దెబ్బతిని న్యూరోపతికి గురి కావడం వల్ల గుండెపోటు వచ్చిన పెద్దగా నొప్పి తెలియదని, ఫలితంగా నిశ్శబ్దంగా మరణిస్తున్నారని నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ గుండం శివ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రపంచ మధుమేహ నిరోధక మాసం సందర్భంగా సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్ , మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఆదివారం బ్రాడీపేట లోని ఎస్‌హెచ్ఓ భవనంలో గుండెజబ్బుల శాస్త్రీయ అవగాహన సభ- ఉచిత వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ తాతా సేవకుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ శివ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మధుమేహం, రక్తపోటును అదుపులో ఉంచకపోతే గుండె, రక్తనాళాల వ్యవస్థపై ప్రభావం చూపిస్తుందని చెప్పారు. క్రమం తప్పకుండా వ్యాయామం, ఆహార నియమాలు పాటించడంతో పాటు మానసిక ఒత్తిడి, ఆందోళనలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం శిబిరంలో పలువురికి ఉచితంగా ఈసీజీ పరీక్ష చేసి వైద్య సలహాలు అందించారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి. ధనుంజయరెడ్డి, ఎస్‌హెచ్‌వో మేనేజర్ పి.నిర్మలారాణి , మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పి.రమేష్, వి.సుబ్రహ్మణ్యం, టి.వి. సాయిరాం ,లక్ష్మీ సామ్రాజ్యం, శివాజీ, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

తెలుగువారి జీవన పాఠాలు శతకాలు

డాక్టర్ ములుకుట్ల విశ్వనాథశర్మ



డాక్టర్ విశ్వనాథశర్మను సత్కరిస్తున్న వెంకటరత్నం, రవిబాబు

తెనాలి: శతకానికి తెలుగువారి జీవితానికి విడదీయలేని బాంధవ్యం ఉందని, శతకాలు తెలుగువారికి జీవన పాఠాలని ప్రముఖ పండితుడు డాక్టర్ ములుకుట్ల విశ్వనాథశర్మ అన్నారు. శతకాలు చేసిన మార్గదర్శనాలతో తెలుగువారు తమ జీవితాలను పండించుకున్నారని సోదాహరణంగా చెప్పారు. వాకర్స్ క్లబ్, తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటైన సభకు క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. 'ఆంధ్ర సాహిత్యంలో శతక వైభవం' అనే అంశంపై డాక్టర్ ములుకుట్ల విశ్వనాథశర్మ ప్రత్యేక ప్రసంగం చేశారు. 12వ శతాబ్దంలో ప్రారంభమైన శతక సాహిత్యం శాఖోపశాఖలుగా విస్తరించి మరే భాషలోనూ లేని ఔన్నత్యాన్ని సాధించిందని చెప్పారు. సుమతీ శతకం, వేమన శతకం నుంచి దాశరధి శతకం వరకు ఆయా కాలాల్లో ప్రజలకు చేసిన మార్గదర్శకాన్ని, నేర్పిన జీవిత విలువలను ఆయన సోదాహరణంగా వివరించారు. సమావేశంలో ఇటీవల మరణించిన బొమ్మదేవర వెంకటేశ్వరరావు, అడుసుమల్లి వెంకటేశ్వరరావుకు నివాళులర్పించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, కార్యదర్శి కడియాల రవిబాబు మాట్లాడారు. చివరగా డాక్టర్ ములుకుట్ల విశ్వనాథశర్మను సత్కరించారు.

'మేఘ గర్జన' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భూసరపల్లి వెంకటేశ్వర్లు తదితరులు

పాత గుంటూరు: నగరంలోని జేఎంహెచ్ కార్యాలయంలో ముస్లిం రచయితల సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి ఖుర్షిద్ బేగం రచించిన 'మేఘ గర్జన' పుస్తకాన్ని ప్రముఖ కవి భూసురుపల్లి వెంకటేశ్వర్లు ఆదివారం ఆవిష్కరించారు. సభకు కవి కరీముల్లా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా నల్లూరి రుక్మిణి, అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలోని అనేక సమస్యలపై హృదయానికి హత్తుకునేలా మేఘ గర్జన పుస్తకాన్ని కవయిత్రి ఖుర్షిద్ బేగం రచించారని పేర్కొన్నారు. చరిత్రలో ఫాసిజం, మతతత్వం గురించి రుక్మిణి వివరించారు. తెలుగు సాహిత్యంలో ముస్లిం రచయితల కృషిని రషీద్ అభినందించారు. కార్యక్రమాన్ని మురసం రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ హకీం పర్యవేక్షించగా, కార్యదర్శి ఎస్. ఎం. సుభాని, కోశాధికారి బషీర్ గర్తపురి, మీడియా కార్యదర్శి సుభాని నిర్వహించారు.

ఘనంగా పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ వార్షికోత్సవం



గుర్రం గాంధీ చిత్రపటం వద్ద నేతల నివాళి

తెనాలి: పట్టణానికి చెందిన పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ సర్వసభ్య సమావేశం, 29వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముత్యంశెట్టిపాలెంలోని సొసైటీ ఆధ్వర్యంలోని శిల్పి అక్కల రామయ్య, కోటిరత్నమ్మ కల్యాణ మండపంలో ఏర్పాటైన సభకు సొసైటీ అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు, స్టేట్ వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ వావిలాల సరళాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘీయులు ఐకమత్యంగా సొసైటీ ద్వారా గత 28 ఏళ్లుగా చేపడుతున్న సేవాకార్యక్రమాలు అభినందనీయమని సరళాదేవి చెప్పారు. సంఘీయుల్లో విద్యావ్యాప్తికి కృషి చేయడం ముదావహమన్నారు. విద్య ద్వారానే అభివృద్ధి చెందగలమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, సీనియర్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరు ఎంవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ సంఘ కార్యకలాపాలను ప్రశంసించారు. వార్షికోత్సవం సందర్భంగా 225 మంది నిరుపేద మహిళలకు దుప్పట్లను పంపిణీ చేశారు. పద్మశాలీ సంఘ రాష్ట్ర నేత గుర్రం గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన సతీమణి జయలక్ష్మి, సరళాదేవిని నరసింహారావు, శ్రీరామ్ సత్కరించారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి గంజి శివభుజంగ ప్రభాకరరావు, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు, సొసైటీ ప్రధాన సలహాదారు రాచాబత్తుని శ్రీనివాసరావు, ప్రముఖ శిల్పి అక్కల శ్రీరామ్, సొసైటీ ఉపాధ్యక్షుడు జొన్నాదుల మహేష్, కోశాధికారి దివి పురుషోత్తం ప్రసంగించారు. కటకం శేషగిరిరావు, కటకం శివప్రసాద్, దివి హేమంత్, దామర్ల పరమేశ్వరరావు పాల్గొన్నారు.

వాహనచోదకులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మంగళగిరి: నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపేవారిపై చర్యలు తప్పవని పట్టణ సీఐ మల్లికార్జునరావు హెచ్చరించారు. నగరంలోని పలు కూడళ్లలో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. మైనర్లను, లైసెన్స్ లేని వారిని, సైలెన్సర్లు లేకుండా తిరిగేవారిని, ట్రిపుల్ రైడింగ్ నిర్వహించే వారితో పాటు వాహనాలు స్వాధీనం చేసుకుని జరిమానా విధించడంతో పాటు కౌన్సెలింగ్ నిర్వహించారు. తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించిన సీఐ, మరోసారి వాహనాలు ఇస్తే వాహనం సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలలో ఎస్ఐలు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీసీతారామ గానసభ సంగీతోత్సవాలు

తెనాలి: పట్టణంలో ప్రఖ్యాత సంగీత సంస్థ శ్రీసీతారామ గానసభ సంగీతోత్సవాలు సోమవారం నుంచి ఆరంభం కానున్నాయి. 2017 వరకు అంటే 70 ఏళ్లపాటు కొనసాగిన సంస్థ సంగీత కార్యక్రమాలు తర్వాత నిలిచిపోయాయి. ప్రస్తుతం పిరాట్ల రమణి అధ్యక్షురాలిగా, దుర్భా హరిబాబు శాస్త్రి కార్యదర్శిగా ఉన్న నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో మళ్లీ కార్యకలాపాల నిర్వహణ చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం నుంచి పదో తేదీ వరకు అయిదురోజుల పాటు సంగీత ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటల్నుంచి 9.30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో తొలిరోజున చెన్నైకు చెందిన వివేక్ మొజికులమ్ గాత్ర కచేరీ ఉంటుంది. పప్పు జ్ఞానదేవ్ వయొలిన్‌పై కేవీ రామకృష్ణ మృదంగంపై వాద్య సహకారం అందిస్తారు. 7వ తేదీన విశాఖపట్నంకు చెందిన గాయని వీరఘంట లలితా చంద్రశేఖర్ గాత్రకచేరీ ఉంటుంది. మహాదాసు నీలాద్రి వయోలిన్‌పై మహాదాసు ఏడుకొండలు మృదంగంపై సహకరిస్తారు. 8వ తేదీన హైదరాబాద్‌కు చెందిన గాయకుడు ఘోరకవి శ్రీకృష్ణ సంపత్‌కుమార్ గాత్రకచేరీకి వయోలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై రాయప్రోలు సుధాకర్ సహకరిస్తారు.